TEL: T/TG/ 2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

## విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్: హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 81 | శుక్రవారం 08-11-2024 | పేజీలు : 5 | వెల :4/-

## కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలు దివాలా తీశాయి: కిషన్ రెడ్డి

- కాంగ్రెస్ పాలనపై 11 నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోందని వ్యాఖ్య
- బీజేపీకి సంస్థాగత ఎన్నికల వ్యవస్థనే ఊపిరి అన్న కిషన్ రెడ్డి
- ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని పిలుపు



**హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు ఆర్థికంగా దివాలా తీశాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలనపై 11 నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోందన్నారు. సికింద్రాబాద్‌లో జరిగిన సంస్థాగత ఎన్నికల ప్రక్రియ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... బీజేపీకి సంస్థాగత ఎన్నికల వ్యవస్థ ఊపిరి అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మహిళలు, యువత, రైతుల సమస్యలపై బీజేపీ పోరాటం చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు.
తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడినట్లయిందన్నారు. ఏడాది పాలన పూర్తి కావొస్తున్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ఓ వైపు సంస్థాగతంగా

మిగతా 2లో

## ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలు

# భర్తీ చేస్తాం..

### ఉప ముఖ్యమంత్రి భట్టి భరోసా

- నిరుద్యోగులకు ఉప ముఖ్యమంత్రి భట్టి భరోసా
- దీనికోసం ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నాం
- సివిల్స్ కు ఎంపికైన వారికి లక్ష ప్రోత్సాహం అందిస్తాం
- అశోక్ నగర్ సివిల్ సర్వీస్ కోచింగ్ సెంటర్ ప్రారంభం
- సివిల్స్‌కు ఎక్కువమంది ఎంపికైతే రాష్ట్రానికి ప్రయోజనం

**హైదరాబాద్:** ఎన్నికల ముందు ప్రకటించినట్టుగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. హైదరాబాదులోని అశోక్ నగర్‌లో సివిల్ సర్వీస్ కోచింగ్ సెంటర్‌ను ఆయన నేడు ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి ఈ రాష్ట్రం కోరి కొట్లాడి తెచ్చుకున్నదే ఉద్యోగాల సాధన కోసం అని అన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు.



దేశంలో ఎక్కడా లేని తరహాలో ఉద్యోగాల భర్తీకి ప్రతి ఏటా వార్షిక క్యాలెండర్ విడుదల చేస్తున్నామని చెప్పారు . ఏ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తామో ముందే తెలియజేస్తున్నామని చెప్పారు. ఇక గా ఇప్పటికే గ్రూప్ -1 పరీక్షలు విజయవంతంగా నిర్వహించామని, గ్రూప్ -2 పరీక్షలు నిర్వహించబోతున్నామని వెల్లడించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ, ఇతర ఇబ్బందులు లేకుండా రాష్ట్రంలో విజయవంతంగా ఉద్యోగాల భర్తీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మేధస్సు ఉన్నప్పటికీ నిరుపేదలు, మధ్య తరగతి వర్గాలవారు ఆర్థిక ఇబ్బందులతో యుపిఎస్సి పరీక్షలను సాధించడంలో ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి వారిని ఆర్థికంగా ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మన రాష్ట్రం నుంచి మెయిన్స్ కు ఎంపికైన వారికి ఇంధన శాఖ పక్షాన ఒక్కొక్కరికి

మిగతా 2లో

## విద్యుత్ ఛార్జీల పెంపు ఘనత జగన్ దే చంద్రబాబు

- అయిదేళ్ల పాలనలో పోలవరంను ముంచారు
- అభివృద్ధిని అటకెక్కించారు
- తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారు
- విద్యుత్ అంటూ ఏకంగా లక్షా 20వేల కోట్లు అప్పు చేశారు
- భావ ప్రకటన అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ లు
- తనను, పవన్, అనితను సైతం వదలడం లేదు
- ఇక వారందరి తాటా తీస్తాం
- హద్దుదాటిన ప్రతిఒక్కరి అంతు చూడటం పక్కా
- తాళ్లయిపాలెంలో జీఐఎస్ సబ్ స్టేషన్ సభలో చంద్రబాబు



**అమరావతి:** అమరావతిని జగన్ ఎడారిగా మార్చేశారని మండిపడ్డారు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు. పోలవరం డయాఫ్రామ్ వాల్ ను నాశనం చేశారని, ఎక్కడ దొరికితే అక్కడ రూ.10లక్షల కోట్లు అప్పు తెచ్చారన్నారు. 20ఏళ్ళు మద్యం తాకట్టు పెట్టి అప్పు చేశారని అన్నారు. అమరావతిలోని తాళ్లయిపాలెంలో జీఐఎస్ సబ్ స్టేషన్ ను ఇవాళ ప్రారంభించారు. దీంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రూ.5407 కోట్లతో నిర్మించిన సబ్ స్టేషన్లను వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, చిత్తూరు, నంద్యాల, శ్రీ సత్య సాయి, శ్రీకాకుళం, అనకాపల్లి, కృష్ణా, ప్రకాశం, తిరుపతి, కడప జిల్లాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లను సీఎం చంద్రబాబు చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభించారు. సీఆర్డీయే పరిధిలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తాళ్ళాయపాలెంలో 400 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. ఆర్థిక అభివృద్ధి సాధించడంలో 24ఐ7 గంటలు విద్యుత్ సరఫరా కీలక పాత్ర పోషించనుంది.
%అనంతరం మాట్లాడుతూ... వైసీపీ అధినేత జగన్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. 2019లో వచ్చిన ప్రభుత్వం విధ్వంసం

మిగతా 2లో

## తడిగుడ్డతో గొంతు కోశారు.. ఆడబిడ్డలను మోసం చేశారు -కెటిఆర్

- కొనుగోళ్లు లేక కల్లాల వద్దే వడ్లు
- 20 రోజులుగా అవస్థ పడుతున్న రైతులు హైడ్రా, మూసీ పేరుతో పేదలపై ప్రతాపం
- ప్రజా సమస్యలు పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- ఏరుదాటాక అన్నట్టుంది సీఎం రేవంత్ తీరు ట్విట్టర్‌లో సెటైర్లతో విరుచుకుపడ్డ కేటీఆర్



**హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. కొనుగోలు కేంద్రాలు లేక 20 రోజులగా కల్లాల వద్ద రైతులు బాధపడుతున్నారని, హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో పేదలపై సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ప్రతాపం చూపిస్తున్నదని గురువారం ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. "తడిగుడ్డతో గొంతు కోయడం అంటే ఏంటో అనుకున్నాం.. కొనుగోళ్లు లేక తడుస్తున్న ఈ ధాన్యం చూస్తుంటే తెలుస్తుంది. కళ్లు కాయలు కాసేలా ఎదురుచూడడం అంటే ఏంటో అనుకున్నాం.. కల్లాల వద్ద 20 రోజులుగా రైతన్నలు పడుతున్న బాధలు చూస్తే తెలుస్తుంది. మీసాలెందుకు రాలేదురా అంటే మేనత్త సాలు అని, గడ్డం ఎందుకు వచ్చిందిరా అంటే మేనమామ పోలిక అంటే ఏంటో

మిగతా 2లో

## చంద్రబాబు కృషితోనే ఐటీ రంగంలో అద్భుత ఫలితాలు.. లోకేష్

- విదేశాల్లో ఉన్నత స్థానాల్లో మన వాళ్లు
- విద్యార్థులు ప్రతి విషయంపై అవగాహన పెంచుకోవాలి
- విజయం సాధించాలంటే పట్టుదల, కఠిన పరిశ్రమ అవసరం
- విట్ విద్యార్థులకు నారా లోకేష్ హితవు



**అమరావతి:** ఐటీ రంగం అభివృద్ధి కోసం చంద్రబాబు చేసిన కృషి వల్లే అద్భుత ఫలితాలు వచ్చాయని అన్నారు మంత్రి నారా లోకేష్.. ఆయన ఇచ్చిన స్ఫూర్తితోనే మన విద్యార్థులు అద్భుతంగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. అమరావతిలోని విట్ వర్సిటీలో అంతర్జాతీయ ఉన్నత విద్య ప్రదర్శనను ఆయన నేడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందు చూపుతో తమ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల విదేశాల్లో ఇప్పుడు మన తెలుగు వాళ్లు మంచి స్థానాల్లో ఉన్నారన్నారు. అంతర్జాతీయ కంపెనీల్లో తెలుగువాళ్లు అగ్రస్థానంలో ఉన్నారని పేర్కొన్నారు. గెలవడం కోసం నిలబడాలన్న మాటను విద్యార్థులు గుర్తుపెట్టుకోవాలని కోరారు. అంతర్జాతీయ పరిణామాల గురించి అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. రాబోయే 25ఏళ్లలో ఇండియా మరింత అభివృద్ధి చెందనుందని చెప్పారు. వికసిత్ భారత్,

మిగతా 2లో




## వలంటీర్లకూ.. మేలు చేస్తాం పవన్ కళ్యాణ్ భరోసా

- పంచాయితీ నిధులను జగన్ మింగేశారు
- అయిదేళ్లలో గ్రామ సీమలు పూర్తిగా మారిపోవాలి
- త్వరలోనే కావాల్సిన నిధులు అందజేస్తాం
- సర్పంచ్‌లను గ్రామ ప్రథమ పౌరులుగా గుర్తిస్తాం
- గ్రామాలు స్వయం సమృద్ధిగా ఎదగాలి
- సర్పంచ్‌ల సమావేశంలో ఉపముఖ్యమంత్రి పవన్

## రేవంత్ రెడ్డి వాస్తు పిచ్చితో సచివాలయంలో మార్పులు చేస్తున్నారు : హరీశ రావు

- గ్రీన్ టెక్నాలజీతో, ఫైర్ సేఫ్టీ నిబంధనలతో సచివాలయాన్ని నిర్మించామన్న హరీశ్ రావు
- ఆధునిక టెక్నాలజీతో తాము సచివాలయం నిర్మిస్తే వాస్తు పిచ్చి అని విమర్శించారని మండిపాటు
- రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక పూటకో మార్పు చేస్తున్నాడని విమర్శ





2లో

## రాజీ కుదిరిందని కేసు కొట్టేస్తారా.. లైంగిక వేధింపుల కేసులో సుప్రీంకోర్టు సీరియస్

- రాజస్థాన్ హైకోర్టు తీర్పును పక్కన పెట్టిన అత్యున్నత న్యాయస్థానం
- ఎఫ్ఐఆర్ కొట్టేయడం సరికాదని వ్యాఖ్య
- పోక్సో, అట్రాసిటీ చట్టాల కింద కేసు నమోదైందని గుర్తుచేసిన వైనం

## భారత్-భూటాన్ మధ్య 'ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్'

- లాంచనంగా ప్రారంభించిన ఆ దేశ ప్రధాన మంత్రి
- హాజరైన కేంద్ర మంత్రి బండి సంజయ్
- ఈ చెక్ పోస్ట్ తో ఇరుదేశాల బంధం మరింత దృడం
- వాణిజ్య , వ్యాపార , విస్తరణ ఇక సులభం అన్న కేంద్ర మంత్రి



# విద్యుత్ ఛార్జీల పెంపు ఘనత జగన్ దే చంద్రబాబు

చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లు సీఎంగా జగన్ చేసిన పాపాలతో నేడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని పేర్కొన్నారు. జగన్ దుర్మార్గ పాలనతో రాష్ట్రం వెనకబడిందన్నారు. వైసీపీ పాపాలకు జనం బలవుతున్నారన్నారు. జగన్ చేసిన పాపాలకు బదులుగా ఓటర్లు ఎన్నికల్లో వాతలు పెట్టి ఇంటికి పంపించారన్నారు. దుర్మార్గులకు అధికారం ఇవ్వడమే ప్రజలు చేసిన తప్పన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని, దీంతో కేంద్రం నిధులు ఇవ్వని పరిస్థితిని తీసుకొచ్చారన్నారు. పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను నాశనం చేశారని చంద్రబాబు విమర్శించారు. జగన్ అరాచక పాలనతో పోలవరం వెనక్కి వెళ్లిందన్నారు. రాష్ట్రంలో రహదారులను గోతుల మయం చేశారన్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి గత వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకుందని ఆరోపించారు. తాను సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నుంచి విద్యుత్తు ఛార్జీలు పెరగవని తాను హామీ ఇస్తున్నట్లు తెలిపారు చంద్రబాబు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగానే ఇటీవల విద్యుత్తు ఛార్జీలు పెరిగాయన్నారు. పేదలపై విద్యుత్ భారానికి కారణం గత ప్రభుత్వమేనని అన్నారు. ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వాడకుండానే వేల కోట్లు చెల్లించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్ళలో విద్యుత్ సంస్థల్లో రూ.1 లక్ష 20వేల కోట్లు అప్పు చేశారన్నారు.

9సార్లు కరెంటు చార్జీలు పెంచి రూ.36వేల కోట్లు భారం వేశారన్నారు. పోలవరం, కృష్ణపట్నం పవర్ ప్లాంట్లను నిర్వీర్యం చేశారని.. ఐదేళ్ళలో విద్యుత్ సంస్థల్లో రూ.1 లక్ష 20వేల కోట్లు అప్పు చేశారన్నారు.1998 లోనే తాను విద్యుత్ సంస్కరణలు తీసుకువచ్చానని గుర్తు చేశారు. తలసరి కరెంటు వినియోగం పెంచాలని సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని అన్నారు. ప్రస్తుతం ఎలాంటి విద్యుత్ సమస్య లు లేకుండా అమరావతిలో సబ్ స్టేషన్ లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అప్పట్లో ఇంటర్ నెట్ కు కూడా తానే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చానని చెప్పారు. ప్రస్తుతం ఫోన్ ప్రతిఒక్కరి దగ్గర ఉందని కానీ దాని గురించి కూడా తానే మొదటిసారి ప్రస్థావించానని అన్నారు. తన తరవాతనే అందరూ మాట్లాడారన్నారు.

ప్రస్తుతం టెక్నాలజీ అభివృద్ధి చెందిందని చెప్పారు. తిరుపతిలో తనపై యాక్సిడెంట్ జరిగిన నాడు టెక్నాలజీ లేదని చెప్పారు. కానీ ఇప్పుడు మీడియాతో పాటూ సోషల్ మీడియా కూడా ఉందని అన్నారు. సోషల్ మీడియాకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని మండిపడ్డారు. కుటుంబ సభ్యుల గురించి అసభ్య పదజాలంతో దూషిస్తున్నారన్నారు.

తన కుటుంబాన్ని అసెంబ్లీలో దూషిస్తే మొట్టమొదటిసారి తాను కన్నీళ్లు పెట్టుకున్నానన్నారు. ఒకప్పుడు విలువలు ఉండేవని ఇప్పుడు అవేమీ లేవని అన్నారు.

అనిత ఓ అడబిడ్డ ఆమె గురించి, పవన్ పిల్లల గురించి కూడా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. మదం ఎక్కువై ఇలాత చేస్తున్నారని ఎవ్వరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

## కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలు దివాలా తీశాయి: కిషన్ రెడ్డి

పార్టీని బలోపేతం చేసుకుంటూ మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలపై పోరాడాలన్నారు. దేశంలో జమ్ముకశ్మీర్ నుంచి తమిళనాడు వరకు దాదాపు అన్ని పార్టీల్లోనూ కుటుంబ పాలన సాగుతోందన్నారు. కానీ బీజేపీలో మాత్రం కార్యకర్తల నుంచి ఉన్నతస్థాయి వరకు పదవులు దక్కుతాయన్నారు. కేసీఆర్ హయాంలో రూ.7 లక్షల కోట్లు అప్పులు అయితే... కాంగ్రెస్ పాలనలోనూ అదే కొనసాగుతోందని ఆరోపించారు. తెలంగాణ లో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని ప్రజలు లోక్ సభ ఎన్నికల్లో తీర్పును ఇచ్చారని వెల్లడించారు.

## రేవంత్ రెడ్డి వాస్తు పిచ్చితో సచివాలయంలో మార్పులు చేస్తున్నారు: హరీశ్ రావు

**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాస్తు పిచ్చితో సచివాలయంలో మార్పులు చేస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు 'సచివాలయంలో వాస్తు మార్పులు' అంటూ వచ్చిన పత్రికా కథనాన్ని ట్వీట్ కు జోడించారు. గ్రీన్ టెక్నాలజీతో, ఫైర్ సేఫ్టీ నిబంధనలతో బీఆర్ఎస్ హయాంలో సచివాలయాన్ని నిర్మించినట్లు చెప్పారు. దేశానికి తలమానికమైన కొత్త సచివాలయాన్ని తాము నిర్మిస్తే... వాస్తు పిచ్చి అంటూ ఆరోజు రేవంత్ రెడ్డి విమర్శలు చేశారని మండిపడ్డారు.

కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఆయన ముఖ్యమంత్రి అయ్యాక సచివాలయానికి పూటకో మార్పు చేస్తున్నాడని విమర్శించారు. వాస్తు దోషం పేరుతో ఒక్క గేటును మార్చడానికి రూ.4 కోట్లు ఖర్చు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ఇది కదా అసలు సిసలైన కాంగ్రెస్ మార్క్ 'మార్పు' అని ఎద్దేవా చేశారు.

## కాలుష్యంతో ఉత్తరాది ఉక్కిరిబిక్కిరి.. నురగలు కక్కుతున్న యుమునా!



వాయు కాలుష్యం ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారింది. అక్కడ రోజురోజుకు కాలుష్యం తీవ్రతరం అవుతుండటంతో ప్రజల్లో ఆందోళన పెరిగింది. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు అధికారులు చర్యలు చేపడుతూనే ఉన్నారు..

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తగ్గేలా కనిపించడంలేదు. రోజురోజుకూ కాలుష్యం తీవ్రమవుతోంది. ఈ పొల్యూషన్ కారణంగా ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు వాయు కాలుష్యంతో ఊపిరితీసుకోవడం ఇబ్బందికరంగా మారగా.. మరో వైపు నీటి కాలుష్యంతోనూ సతమతమవుతున్నారు. యయునా నదిలో కాలుష్య స్థాయి విపరీతంగా ఉంది. ఢిల్లీలోనే కాదు..

ఉత్తరభారతంలోని చాలా ప్రాంతాల్లో కాలుష్య స్థాయిలు విపరీతంగా పెరిగిపోయాయి. నోయిడా, ఘజియాబాద్, ప్రయాగరాజ్, అలీగఢ్, ముంబై లాంటి ప్రదేశాల్లో కాలుష్యం తీవ్రంగా ఉంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. దేశ రాజధానిలో గాలి నాణ్యత సూచి 358గా నమోదైంది. అలీపూర్‌లో ఏక్యూఐ 372గా, బావన ప్రాంతంలో 412, ద్వారకా సెక్టార్ 8లో 355, ముండ్కాలో 419, రోహిణిలో 401, పంజాబి బాగ్‌లో 388గా నమోదైంది.

ఇక దేశరాజధాని ఛట్ పూజ వేడుకలకు రెడీ అవుతోంది. యమునా నదితీరంలో పూజ కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఢిల్లీ హైకోర్టు పూజపై కొన్ని ఆదేశాలు జారీచేసింది. యమునా నది ఒడ్డున ఉన్న గీతా కాలనీ ఘాట్‌ల దగ్గర నిషేధాన్ని ఎత్తేయాలంటూ ఇటీవల ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కాని.. హైకోర్టు మాత్రం నిరాకరిచింది. విషతుల్యమైన నీటిలో ప్రజలు దిగి పూజలు నిర్వహించడం ఎంతమాత్రం శ్రేయస్కరం కాదని హైకోర్టు స్పష్టంగా చెప్పింది. అయితే నీటిలో దిగకుండా పూజలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## తడిగుడ్డతో గొంతు కోశారు.. ఆడబిడ్డలను మోసం చేశారు -కెటిఆర్

అనుకున్నాం.. రుణమాఫీ, రైతుభరోసా, ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి కింద లక్ష 116, తులం బంగారం అడిగితే కాంగ్రెస్ నేతలు చెబుతున్న సాకులు చూస్తుంటే అర్థం అవుతుంది అని కేటీఆర్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

**ఏరుదాటిన తర్వాత...**

అందితే జుట్టు అందకపోతే కాళ్లు అంటే ఏమో అనుకున్నాం.. ఓట్ల కోసం నాడు నిరుద్యోగుల కాళ్లు పట్టుకుని, నేడు వారి మీద నిర్దాక్షిణ్యంగా లాఠీఛార్జ్ చేస్తుంటే అర్థం అవుతుంది. సుఖం వస్తే మొకం కడగడానికి తీరిక లేదంటే ఏమో అనుకున్నాం.. పది నెలల పాలనలో సీఎం, మంత్రుల 25కు పైగా ఢిల్లీ, 26కు పైగా విదేశీ పర్యటనలు చూస్తే అర్థమవుతుంది. తేలుకు పెత్తనం ఇస్తే తెల్లవార్లు కుట్టిందంటే ఏమో అనుకున్నాం.. హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో పేదలపై ప్రభుత్వ ప్రతాపం చూస్తుంటే అర్థం అవుతుంది. ఏరు దాటే వరకు ఓడ మల్లన్న.. ఏరు దాటిన తరువాత బోడ మల్లన్న అంటే ఏమో అనుకున్నాం.. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూస్తే అర్థం అవుతుంది' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

ఈ మార్పు.. మాకొద్దు!

ఇదో పనికిమాలిన పాలన పల్లె ప్రగతి లేదు.. పట్టణ ప్రగతి లేదు పట్టించుకునేవారు లేక పట్టణాల విలవిల కాంగ్రెస్ సర్కారును కూకటివేళ్లతో పెకిలించాల్సిందే ట్విట్టర్‌లో విమర్శలు చేసిన బీఆర్ఎస్ నేత కేటీఆర్ కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమంతో రాష్ట్రంలోని పల్లెలు, పట్టణాల రూపురేఖలు మారిపోయాయి. తెలంగాణ తొలి పాలకుడి ఆశయాలను రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ నీరుగార్చడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ పనికిమాలిన పాలనలో పల్లె ప్రగతి లేదు.. పట్టణ ప్రగతి లేదని ట్విట్టర్‌లో విమర్శించారు. ముందుచూపు లేని ముఖ్యమంత్రితో రాష్ట్రానికే అతీగతీ లేదని దుయ్యబట్టారు.

**సమస్యలకు నిలయంగా పల్లెలు..**

'పల్లె ప్రగతి' వల్ల మొన్నటి దాకా మురిసిన పల్లెలు.. నేడు మురికి కూపాలను తలపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రగతితో పరుగులు తీసిన పట్టణాలు, నేడు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయని ఫైరయ్యారు. ఒకప్పుడు పల్లె కన్నీరు పెడుతోంది అని పాడుకున్నాం.. ఇప్పుడు పట్టణాలు విలవిలలాడుతున్నాయని బాధపడే దుస్థితి దాపురించిందని కేటీఆర్ విమర్శించారు. ఈ మార్పు మాకొద్దు అనే నినాదం మొదలైందని, కాంగ్రెస్‌ను కూకటివేళ్లతో పెకిలించే రోజు దగ్గరపడిందని ఎక్స్ వేదికగా చెప్పారు.

## చంద్రబాబు కృషితోనే ఐటీ రంగంలో అద్భుత ఫలితాలు.. లోకేష్

వికసిత్ ఏపీ నినాదంతో ముందుకెళ్తున్నామని, ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగేందుకు అవకాశం ఉందని లోకేశ్ తెలిపారు. ఉన్నత విద్య కోసం తాను కూడా విదేశాలకు వెళ్లి వచ్చానని అంటూ మనకు, విదేశాల్లో ఉన్నత విద్యకు తేడాలు ఉన్నాయని చెప్పారు. విదేశాల్లో పరీక్షల సమయంలో ఇన్విజిలేటర్లు ఉండరని చెప్పారు. ఏపీ వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోవడంతో ఇటు విద్యార్థులతో పాటు కళాశాల యాజమాన్యాలు ఇబ్బంది పడుతున్నాయి. అనేక మంది విద్యార్థులు ఇటీవల సోషల్ మీడియా వేదికగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎక్స్ (ట్విట్టర్) వేదికగా గురువారం ఆయన స్పందించారు. ఈమేరకు హ్యూమన్ రీసోర్స్ మినిస్టర్ లోకేష్ కీలక ప్రకటన చేశారు.

**3500 కోట్ల బకాయిలను చెల్లిస్తాం..**

ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదును కళాశాల ఖాతాలకు నేరుగా బదిలీ చేసే పాత పద్ధతిని పునరుద్ధరిస్తామని మంత్రి లోకేష్ తెలిపారు. గత ప్రభుత్వం పెట్టిన ₹3,500 కోట్ల బకాయిలను దశలవారీగా చెల్లిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్‌లు, ఇతర డాక్యుమెంట్ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. విద్యార్థులకు తన పూర్తి సహకారం, మద్దతు ఉంటాయని తెలిపారు.

**సిస్టమ్‌ని మళ్లీ పునరుద్ధరిస్తాం..**

గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం నేరుగా కళాశాల ఖాతాలకు జమ చేస్తుండేది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విధానానికి స్వస్తిపలికి కళాశాల ఫీజుల నగదును విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేసే విధానం ప్రవేశపెట్టింది. దీంతో తల్లుల ఖాతాలో జమ అయిన నిధులను విద్యార్థులే కళాశాలలకు చెల్లించే వారు.

అయితే ఈ విధానంతో ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తల్లుల ఖాతాలో జమ చేసినా కొందరు సకాలంలో కళాశాలలకు చెల్లించకపోవడం వంటి సమస్యలు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి పాత విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తోంది. అదే విషయాన్ని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.

## వలంటీర్లకూ.. మేలు చేస్తాం పవన్ కల్యాణ్ భరోసా

**విజయవాడ:** గత ప్రభుత్వం మోసం చేసిన వలంటీర్లకు మేలు చేయాలనే ఆలోచలతోనే కూటమి ప్రభుత్వం ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అయతే.. వాళ్లు ఉద్యోగంలో ఉంటే రద్దు చేయవచ్చని, కానీ వాళ్లు అసలు వ్యవస్థలోనే లేరని చెప్పారు. ఇదో సాంకేతిక సమస్య అని. దీన్ని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు.

అమరావతిలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో సర్పంచ్ సంఘాల ప్రతినిధులతో గురువారం పవన్ కళ్యాణ్ సమావేశం అయ్యారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు బాబూ రాజేంద్రప్రసాద్‌తో పాటు వివిధ జిల్లాల నుంచి సర్పంచ్‌లు వచ్చారు. ఈ సందర్భంగా వలంటీర్ వ్యవస్థను రద్దు చేయాలని సర్పంచులు విజ్ఞప్తి చేశారు.. దీనిపై స్పందించిన పవన్ ఉద్యోగాల్లో లేని వాళ్ల గురించి ఏం నిర్ణయం తీసుకోవాలో అలోచిస్తామని అన్నారు..

**మాది చేతల ప్రభుత్వం...**

దేశంలో 70శాతం ప్రజలు పల్లెల్లోనే ఉంటారని.. గ్రామాలను బలోపేతం చేస్తూ గాంధీ సిద్ధాంతాలను ముందుకు తీసుకువెళ్లాలనే ఆకాంక్షతోనే తాము ఉన్నామని ఉపముఖ్యమంత్రి పవన్ అన్నారు. మాటలతో కాకుండా చేతలతోనే తమ ప్రభుత్వం పని తనం చూపుతుందని తెలిపారు.

సర్పంచ్‌లు ఇచ్చిన 16 డిమాండ్స్‌లో కీలకమైన వాటిని గుర్తించి వాటిని పూర్తి చేశామన్నారు. కేరళలో పని చేస్తున్న అధికారి కృష్ణతేజను డిప్యూటేషన్ మీద తీసుకువచ్చామని తెలిపారు. ఆయన సహకారం వల్లే నేడు గ్రామాల అభివృద్ధికి ప్రణాళికులు సిద్ధం చేసి అమలు చేస్తున్నట్లు తెలిపారు. తన పేషీలో ప్రజలకు మేలు చేద్దామనే ఆకాంక్ష ఉన్న అధికారులు ఉండటం అదృష్టమన్నారు.

**ఎంపీ ల్యాడ్స్‌తో కమ్యూనటీ హాల్స్..**

ఎంపీ ల్యాడ్స్ ఫండ్స్ ద్వారా కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు పూర్తి చేస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ చెప్పారు. 2014 నుంచి 2019 వరకు చేసిన పనులకు గత ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని.. ఆ నిధులు విడుదల చేసేందుకు కేబినెట్‌లో నిర్ణయించామని తెలిపారు.

అమరావతిలో పంచాయతీరాజ్ భవనానికి రెండు ఎకరాలు కేటాయించాలని తనని కోరారని.. ట్రైనింగ్ సెంటర్ కూడా నిర్మాణం చేసే విధంగా అవసరమైన స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఇక గ్రామాలలో నరేగా పథకం కింద రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని సర్పంచ్ లను కోరారు.

ఇప్పటికే దీనిపై పల్లె వనాలు పేరుతో ఆలోచన చేస్తున్నామని తెలిపారు. సర్పంచ్‌లకు ప్రథమ పౌరుల స్థానం ఇవ్వాలని అప్పుడే వారికి ఆ గుర్తింపు ఉంటుందన్నారు. పంచాయతీలకు నిధులు ఎక్కువ కావాలని.. ఇందుకు స్వయం పోషక పంచాయతీలుగా ఎదగాలని అన్నారు.

**వారి జీతాలు పెంచే ఆలోచనలో..**

సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీలకు వేతనాలు పెంపుపై కూడా కసరత్తు చేస్తున్నామని పవన్ అన్నారు. అయితే పంచాయతీల్లో కూడా ఆదాయ వనరులు పెంచుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. వచ్చే యాభై ఏళ్లలో కలప అవసరం చాలా ఉంటుందని తెలిపారు. అందువల్ల గ్రామాల్లో వెదురుబొంగులను పెంచి.. బయో డీజిల్ తయారీకి సరఫరా చేసేలా చేయాలని సూచించారు. ప్రతి గ్రామం నుంచి కలపను పెంచేలా లక్ష్యాలను నిర్దేశిస్తే ఆదాయం వస్తుందని తెలిపారు.

## భారత్-భూటాన్ మధ్య 'ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్'

అసోం భారత్-భూటాన్ దేశాల మధ్య మధ్య నేడు చారిత్రక పరిణామం చోటు చేసుకుంది. అసోంలోని దరంగా వద్దనున్న భూటాన్ సరిహద్దులో 'ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్' ప్రారంభమైంది. భూటాన్ ప్రధానమంత్రి శెరింగె తోబ్గే, అసోం గవర్నర్ ఆచార్య లక్ష్మణ్ ప్రసాద్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గరీటా చేతుల మీదుగా 'ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్" ప్రారంభింఅచరు. ఈ చెక్ పోస్ట్ ఏర్పాటు వల్ల ఇరు దేశాల ప్రజల మధ్య రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. చెక్ పోస్టు ఏర్పాటుతో భారత్ కు లాజిస్టిక్ ఖర్చుల భారం చాలా మేరకు తగ్గనుంది. ఇరుదేశాల మధ్య సత్సంబంధాలు మరింతగా పెరగనున్నాయి. వ్యాపార, వాణిజ్య, సేవా కార్యకలాపాలను సులభతరం కానుంది.

ఈ సందర్భంగా బండి సంజయ్ ప్రసంగిస్తూ%ొ% 'ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్' ప్రారంభంతో భారత్, భూటాన్ దేశాల సంబంధాలు మరింత బలపడతాయన అన్నారు.. భారత-భూటాన్ సంబంధాలు పరస్పర గౌరవం, సాంస్కృతిక సౌభ్రాతృత్వం, గొప్ప విశ్వాసం పైన ఉన్నాయన్నారు. ఇరుదేశాల మధ్య స్నేహం, సహకారం, సామాజికత భాగస్వామ్యానికి ప్రబల సాక్ష్యమని పేర్కొన్నారు. ఇరు దేశాల భాగస్వామ్యం నీటి వనరులు, విద్యుత్ ఉత్పత్తి, సమాచార, ఆరోగ్యం, సాంస్కృతిక మార్పిడి, వ్యవసాయం, అంతరిక్ష పరిశోధన విద్య వంటి కీలక రంగాలకు విస్తరించిందన్నారు. ఇమ్రిగ్రేషన్ చెక్ పోస్టు ఏర్పాటువల్ల రవాణా, వాణిజ్య తోడ్పాటు అందించడం మాత్రమే కాకుండా పొరుగున ఉన్న దేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేయాలన్న భారత్ ఆకాంక్షలకు సాక్షిగా ఉంటుందన్నారు.

## ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం..

లక్ష రూపాయలు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహంగా అందించినట్లు తెలిపారు. మెయిన్స్ సాధించి ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి కూడా లక్ష రూపాయలు ప్రోత్సాహంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి మెటీరియల్, ప్రత్యేక శిక్షణ వంటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు వివరించారు. సివిల్ సర్వీస్ కు మన రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున ఎంపిక అయితే మన ప్రాంతానికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. సివిల్ సర్వీస్ అయినప్పటికీ పాలనలో మనవాళ్లు ఎంత ఎక్కువ మంది ఉంటే ప్రాంతీయ అభిమానంతో సంక్షేమ పథకాలు, బడ్జెట్ రూపకల్పన, ఇతర అంశాల ద్వారా మన రాష్ట్రానికి అంత ఎక్కువ లబ్ధి చేకూర్చే అవకాశం ఉంటుందన్నారు. యూపీ క్యాడర్లో పనిచేస్తున్నప్పటికీ ప్రాంతీయ అభిమానంతో తెలుగు వారైన మోహన్ రావు, అరుణ ల ఆధ్వర్యంలో హైదరాబాదులో యుపిఎస్సి కోచింగ్ సెంటర్ ప్రారంభించడం అభినందనీయం అన్నారు. ఏ అంశాలపై దృష్టి పెట్టి, ఎలా చదివితే ఎంపిక అవుతామో తెలుసుకుంటే ఎక్కువమంది సివిల్ సర్వీసెస్ కు ఎంపిక అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఉత్తర భారత దేశంలో ఎక్కువ అకాడమీలు అందుబాటులో ఉండడంతో ఆ రాష్ట్రాల నుంచి సివిల్ సర్వీసెస్ కు ఎక్కువమంది ఎంపిక అవుతున్నారని తెలిపారు. మన రాష్ట్రానికి మేలు జరగాలంటే పెద్ద సంఖ్యలో సివిల్స్ కోచింగ్ అకాడమీలు రావలసిన అవసరం ఉందన్నారు.

## రాజీ కుదిరిందని కేసు కొట్టేస్తారా.. లైంగిక వేధింపుల కేసులో సుప్రీంకోర్టు సీరియస్

**రాజస్థాన్ :** లైంగిక వేధింపుల కేసులో రాజీ కుదిరిందనే కారణంతో కేసు కొట్టేయడం సబబు కాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఈమేరకు లైంగిక వేధింపుల కేసులో ఓ టీచర్ పై నమోదైన ఎఫ్ఐఆర్ ను కొట్టేయాలంటూ రాజస్థాన్ హైకోర్టు వెలువరించిన తీర్పును పక్కన పెట్టింది. సదరు టీచర్ ను ప్రాసిక్యూట్ చేయాలని పోలీసులను ఆదేశించింది.

**కేసు ఏంటంటే..**

2022లో రాజస్థాన్ లోని గంగాపూర్ సిటీలో ఓ దళిత బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు విమల్ కుమార్ గుప్తా అనే ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిపై ఆరోపణలు వచ్చాయి. దీనిపై బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించడంతో విమల్ కుమార్ గుప్తాపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాల మేరకు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. కేసు విచారణ జరుగుతుండగా విమల్ కుమార్ గుప్తా బాధిత కుటుంబంతో రాజీ కుదుర్చుకున్నాడు. అపోహతో, మిస్ అండర్ స్టాండింగ్ వల్ల తాము కేసు పెట్టామని, టీచర్ గుప్తాపై ఎలాంటి చర్యలు తీసుకోవాలని తాము కోరుకోవడంలేదంటూ బాలిక తల్లిదండ్రులతో ఓ స్టాంప్ పేపర్ రాయించుకున్నాడు. ఈ పేపర్‌ను పోలీసులకు సమర్పించగా.. వారు కోర్టులో ఫైల్ చేశారు. అయితే, కోర్టు ఈ స్టాంప్ పేపర్‌ను ఆమోదించలేదు.

దీంతో గుప్తా రాజస్థాన్ హైకోర్టును ఆశ్రయించాడు. కేసు విచారించిన హైకోర్టు.. స్టాంప్ పేపర్ ను పరిశీలించి, బాలిక తల్లిదండ్రుల వాంగ్మూలం తీసుకున్నాక కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. గుప్తాపై నమోదైన ఎఫ్ఐఆర్ ను కొట్టేయాలంటూ పోలీసులను ఆదేశించింది.

**సుప్రీంకోర్టులో సోషల్ వర్కర్ పిటిషన్...**

రాజస్థాన్ హైకోర్టు తీర్పుపై సోషల్ వర్కర్ రాంజీ లాల్ భైర్వా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుప్తాపై నమోదైన ఎఫ్ఐఆర్ ను కొట్టివేయడాన్ని సవాల్ చేశారు.

ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం.. లైంగిక వేధింపుల కేసులో రాజీకి అవకాశం లేదని పేర్కొంది. పైగా ఈ కేసులో పోక్సో చట్టం, అట్రాసిటీ యాక్ట్ ఇంక్లూడ్ అయి ఉన్నాయని గుర్తు చేసింది. టీచర్ విమల్ కుమార్ గుప్తాపై ఎఫ్ఐఆర్ పునరుద్ధరించి, ఆయనను ప్రాసిక్యూట్ చేయాలని పోలీసులను ఆదేశించింది.

## గ్రామ సింహాలా.. మజాకానా.. కిడ్నాపర్‌లను ముప్పుతిప్పలు పెట్టిన కుక్కలు.. దెబ్బకు సినిమా చూశారుగా



సోమవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో తన మేనకోడలు ఇంట్లో ఒంటరిగా ఉండగా, ఇద్దరు వ్యక్తులు వచ్చి తలుపు కొట్టారు. బాలిక తలుపు తెరవగా, ఓ వ్యక్తి ఆమెను ఎత్తుకుని పారిపోయే ప్రయత్నం చేశాడు. బాలిక అరవకుండా నోటిని గట్టిగా మూసివేశారని, గోడకు అవతలివైపు ఉన్న పొలంలో నిలబడి ఉన్న మరో దుండగుడి వైపుకు విసిరాడు. ఆ తరువాత అతడు కూడా గోడ దూకి అటువైపు వెళ్లాడు.

కుక్కల విధేయత గురించి సోషల్ మీడియాలో అనేక వార్తలు విన్నాం, చూశాం. కుక్కలు తమ యజమానికి ఎంత విధేయంగా ఉంటాయో అనేక సంఘటనలు నిరూపించాయి. అయితే, మధ్యప్రదేశ్‌లోని బెత్మాలో జరిగిన ఒక సంఘటనతో కుక్కలు తమ యజమానికి మాత్రమే కాదు.. ఆ వీధిలో నివసించే ప్రతి వ్యక్తికి విధేయంగా ఉంటాయని ఖచ్చితంగా నమ్మాల్సిందే. ఇక్కడ వీధి కుక్క ఓ బాలిక ప్రాణాలను రక్షించాయి.. కిడ్నాప్‌కు గురైన పదేళ్ల బాలికను వీధికుక్కలు కాపాడాయి. పదేళ్ల బాలికను కిడ్నాప్ చేసేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులను వీధి కుక్కలు తరిమి కొట్టాయి. దెబ్బకు దుండగులు పారిపోయేలా చేశాయి. మధ్యప్రదేశ్‌లోని బెత్మాలో కిడ్నాప్‌కు గురైన పదేళ్ల బాలికను వీధికుక్కలు కాపాడాయి. ఈ ఘటనలో ఇద్దరు దుర్మార్గులు ఒంటరిగా ఉన్న బాలికను చూసి ఆమెను కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారు. అక్కడే ఉన్న వీధికుక్కలు గమనించిన దుండగులపై దాడి చేశాయి. కుక్కల దాడితో అగంతకులు భయపడి బాలికను వదిలిపెట్టి పరుగులు తీశారు. ఈ ఘటన బెత్మాలోని కాలీ బిలౌడ్ గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలి మేనమామ శ్రవణ్‌కుమార్ చెప్పిన వివరాల మేరకు.. సోమవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో తన మేనకోడలు ఇంట్లో ఒంటరిగా ఉండగా, ఇద్దరు వ్యక్తులు వచ్చి తలుపు కొట్టారు. బాలిక తలుపు తెరవగా, ఓ వ్యక్తి ఆమెను ఎత్తుకుని పారిపోయే ప్రయత్నం చేశాడు.

బాలిక అరవకుండా నోటిని గట్టిగా మూసివేశారని, గోడకు అవతలివైపు ఉన్న పొలంలో నిలబడి ఉన్న మరో దుండగుడి వైపుకు విసిరాడు. ఆ తరువాత అతడు కూడా గోడ దూకి అటువైపు వెళ్లాడు. ఈ క్రమంలోనే వీధి కుక్కలు వారిని వెంబడించాయి. అప్పుడు అమ్మాయి వారి పట్టు నుండి తప్పించుకుని సమీపంలోని ఆలయంలో దాక్కుంది. ఇక్కడ కుక్కలు కిడ్నాపర్లిద్దరినీ తరిమికొట్టాయి. కిడ్నాపర్లిద్దరూ ప్రాణాలను కాపాడుకునేందుకు పరుగులు తీయడం ప్రారంభించారు. ఈ విధంగా వారిద్దరూ పారిపోవడంతో బాలిక ప్రాణాలను కాపాడారు.

విషయం వెలుగులోకి రావడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. కానీ, ఇంకా ఎవరినీ అరెస్టు చేయలేదు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు.

# విద్యుత్ ప్రమాదంలో మరణించిన వ్యక్తికి 5 లక్షల పరిహారం

## ప్రభుత్వ విప్ చేతుల మీదుగా అందజేత



వేములవాడ ( మన వెలుగు ) నవంబర్ 07 :వేములవాడ పట్టణానికి చెందిన ఆడెపు గంగాధర్ 2023 జనవరిలో ఎల్ టి వైర్ తగిలి విద్యుత్ ప్రమాదానికి గురై మరణించడం జరిగింది. మరణించిన ఆడెపు గంగాధరకు సెస్ విద్యుత్ సహకార సంస్థ నుండి 5 లక్షల రూపాయల పరిహారపు చెక్కు మంజూరు కాగా, అట్టి చెక్కును ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా గంగాధర్ భార్య ఆడెపు మాధవికి గురువారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ నామాల ఉమా లక్ష్మీరాజం, సెస్ ఏఈ సిద్ధార్థ పాల్గొన్నారు.

# వరి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



**నారాయణ పేట ప్రతినిధి ( మన వెలుగు ) నవంబర్ 07 :**రైతులు నాణ్యమైన వరి ధన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కలెక్టర్ శిక్తా పట్నాయక్ అన్నారు గురువారం నారాయణపేట జిల్లా కొల్లంపల్లి ధన్వాడ మరి కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు రైతులకుఇబ్బంది కలగకుండా మరి కొనుగోలు చేయాలని తెలిపారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన అట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు మరియు సన్న వరి కొనుగోలు విధానం, బోనస్ విషయాల పై కలెక్టర్ రైతులను అభిప్రాయాలు అడిగి తెలుకున్నారు

# గ్రూప్ -3 పరీక్షను పగడ్బందీగా నిర్వహించాలి

## - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు ) నవంబర్ 07 :** గ్రూప్-3 పరీక్షను పగడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై రెవెన్యూ అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ తో కలిసి సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ.. ఈ నెల 17,18 తేదీల్లో నిర్వహించానున్న గ్రూప్-3 పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలని అధికారు లకు ఆదేశాలు జారీ చేశారు.

# ఏసీబీకి పట్టుబడిన డీఈఓ రవీందర్



**మహబూబ్ నగర్ ( మన వెలుగు ) నవంబర్ 07 :** డీఈవో రవీందర్ ఒక ఉపాధ్యాయుడి నుండి లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీకి పట్టుబడ్డాడు. ఒక ఉపాధ్యాయుడికి దక్కవలసిన సీనియారిటీ దక్కకపో వడంతో తనకు న్యాయం చేయాలని పలుమార్లు డీఈఓకు విజ్ఞప్తి చేశారు. 50,000 రూపాయలు లంచం డిమాండ్ చేయడంతో ఆ ఉపాధ్యాయుడు ఏసీబీ డీఎస్పీ కృష్ణ గౌడ్ ను ఆశ్రయించారు. పథకం ప్రకారం గురువారం ఉదయం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో ఉన్న డీఈవో ఇంటికి వెళ్లి 50 వేల రూపాయలు ఇస్తుండగా డీఎస్పీ కృష్ణ గౌడ్ బృందం డీఈఓను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం 50 వేల రూపాయలు స్వాధీనం చేసుకొని విచారణ చేస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియవలసి ఉంది.

# పాఠశాల స్థాయి చెకుముకి టాలంట్ టెస్ట్



**ముధోల్ (మన వెలుగు) నవంబర్ 07 :** తానూర్ మండలంలోని భోసి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబురాలు 2024 సందర్భంగా పాఠశాల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ పాఠశాలలో నిర్వహించడం జరిగింది. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చి 8,9,10 తెలుగు మరియు ఆంగ్ల మాధ్యమం ప్రథమ స్థానంలో ఉన్న విద్యార్థులకు మండల స్థాయిలో నవంబర్ 21, జిల్లా స్థాయిలో నవంబర్ 28, రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 14,15,16 తేదీల్లో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, వందన, గంగాధర్, ద్రుపత్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జగత్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పలోని పార్కులను అభివృద్ధి చెయ్యండి



సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్

**కుత్బుల్లాపూర్ ( మన వెలుగు ) నవంబర్ 07 :**గత నెల ప్రజవానిలో పార్కులను అభివృద్ధి చెయ్యాలని సిపిఐ గా వినతిపత్రం ఇస్తే ఇప్పటివరకు సంబందిత అధికారులు స్పందించలేదని ఇప్పటికైనా సంబంధిత అధికారులకు ఆదేశాలు జరిచేసి వెంటనే అభివృద్ధి అయ్యేలా చూడాలని నేడు గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి సిపిఐ బృందం మరోసారి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు డిప్యూటీ కమిషనర్ గారితో మాట్లాడుతూ జగత్గిరిగుట్ట రాజీవ గృహకల్ప లోని పార్కులు నిరూపయోగంగా ఉన్నాయని, అందులో మట్టి,వ్యర్ధాలు వేసుతున్నారని, రాత్రి సమయంలో గంజాయి,మందు బాబులకు అడ్డగా మారాయని కావున వెంటనే మరమత్తులు చేసి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని చెప్పారు.అదే విదంగా రాజీవగృహకల్ప లో రోడ్డు కు ఇరువైపుల డబ్బాలు వేసుకొని ఆ వ్యాపారం మాటున వెనుక ఉన్న స్థలాన్ని ఆక్రమించడానికి చూస్తున్నారని ఇదే విషయం పత్రికలో వచ్చాయని దింట్లో జి హెచ్ ఏం సి కాంట్రాక్టర్ హస్తం ఉందని కూడా వచ్చాయని దీన్ని అలాంటి వారు మునిసిపల్ కు ఎలాంటి సంబంధం ఉన్నా వెంటనే వారి పై చర్య తీసుకోవాలని కోరారు.లేకపోతే దీన్నే అదునుగా చూసుకొని ఇతర మునిసిపల్ వారు కూడా పనిచేసే అవకాశం ఉన్నదన్నారు.అలాగే జగత్గిరిగుట్ట రోడ్ నంబర్ 1లొ సీసీ రోడ్ పూర్తిగా ద్వంసం అయ్యిందని కొత్త రోడ్డు వెయ్యాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, సహాదేవ్ రెడ్డి,ఇమామ్, వెంకటేష్ లు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో అవకతవకలు.. కలెక్టర్ కు ఫిర్యాదు

## 35 వార్డు కౌన్సిలర్ జయశ్రీ

**జగిత్యాల ప్రతినిధి ( మన వెలుగు ) నవంబర్ 07 :** మున్సిపాలిటీలో ఔట్సోర్సింగ్ విభాగం లో పనిచేయడానికి 2020 జనవరి 27 సంవత్సరంకుగాను కేవలం 215 మంది కార్మికులు సానిటేషన్ పరిశుద్ధ సిబ్బంది ఉండేవారు కానీ కొత్త పాలకవర్గం ఏర్పడ్డ తర్వాత కలెక్టర్ అనుమతి లేకుం డా ఆ అధికారులను సంప్రదించకుండా ఇష్టానుసారంగా పారిశుద్ధ విభాగం కార్మికులను నియమించారు ఇట్టి విషయం కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళగా పట్టణ సమాఖ్య , ద్వారా పది మంది డ్రైవర్లను 20 మంది లేబర్ లను తీసుకోవడం జరిగింది ఇందులో నుండి 12 మంది స్వచ్ఛందంగా విధుల నుండి తొలగిపోవడంతో అప్పటి కమిషనర్ స్వరూప రాణి 12 మందిని నియమించారు కమిషనర్ ట్రాన్స్ఫర్ కావడంతో కొత్తగా వచ్చిన నరేష్ కమిషనర్ ఇన్చార్జ్ మున్సిపల్ చైర్మన్ ఇట్టి కార్మికులకు పిఎఫ్ నెంబర్ అలాట్ చేయడానికి ఒక్కొక్కరి దగ్గర లక్ష 50 వేల నుండి రెండు లక్షల వరకు తీసుకున్నట్టు పిఎఫ్ నెంబర్ అలాట్ అయినా కార్మికులు చెప్పుకోవడం విడ్డూరం ఇదిలా ఉండగా ఒక కంప్యూటర్ ఆపరేటర్ను 13 మంది లేబర్ లను కమిషనర్ సమ్మయ్య నియమించారు వీరి వద్ద కూడా లక్ష యాభై వేల నుండి రెండు లక్షల వరకు రూపాయలను వసూలు చేశారని చెప్పుకొచ్చారు ఈ రూపాయలు ఎవరికి ఎంత ఇచ్చారు తెలియదు మరియు సైకిల్ గాని మోటార్ సైకిల్ గాని ఎవరైనా ఎత్తుకెళ్తే పోలీస్ కంప్లైంట్ చేసి హడావుడి చేసేవారు జగిత్యాల మునిసి పాలిటీలో రెండు ట్రాక్టర్లు మిస్సయిన చర్యలు




మాత్రం శూన్యం అసలు జగిత్యాల మున్సిపాలిటీలో ఇష్టాను సారంగా పరిపాలన కొనసాగుతుంది పై విషయాలపై స్పందించి అవక తవకలపై దర్యాప్తు జరిపి దోషులపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.

# శ్రీకాళహస్తిలో మహిళా అఘోరి ఆత్మహత్యాయత్నం




**శ్రీకాళహస్తి ( మన వెలుగు ) నవంబర్ 07 :** తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ఓ మహిళా అఘోరి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తన వెంట తెచ్చుకున్న కిరోసిన్ను శరీరంతో పాటు తన కారుపై పోసి అగ్గిపుల్ల గీసి నిప్పు అంటించుకునే ప్రయత్నం చేసింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆ మహిళా అఘోరీని అడ్డుకున్నారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి దర్శనానికి ఆలయ అధికారులు అనుమతించలేదు. దీనికి నిరసనగా ఆమె ఈ చర్యకు పాల్పడ్డారు. దీనికి సంబంధించిన వీడియో ఒకటి ఇపుడు సోషల్ మీడియాలో వైరల్ అయింది. తెలంగాణలోని సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడిలో దుండగులు విగ్రహాన్ని ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత మహిళా అఘోరి ముత్యాలమ్మ ఆలయం సందర్శించారు. ఆ తర్వాత నిత్యం ఏదో ఒక ఆలయాన్ని సందర్శిస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. సనాతన ధర్మం కోసం ఆత్మార్పణ చేసుకుంటానని ప్రకటించడం తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. దీంతో శాంతి భద్రతల సమస్య ఉత్పన్నమవుతుందని పోలీసులు మహిళా అఘోరిని రాష్ట్రం విడిచి వెళ్లాలని ఆదేశించారు. ఫలితంగా మహారాష్ట్రకు వెళ్లిన అఘోరి.. అక్కడి ఆలయాలను సందర్శించుకున్నారు. ఈ క్రమంలోనే మహిళా అఘోరి గురువారం అకస్మాత్తుగా శ్రీకాళహస్తిలో ప్రత్యక్షమయ్యారు. స్వామి వారి దర్శనం కోసం వెళు తుండగా పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహం చెందిన మహిళా అఘోరి.. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎట్టిపరిస్థితుల్లోనూ స్వామిని దర్శించుకోకుండా వెళ్లబోనని, అవసరమైతే ఆత్మార్పణ చేసుకుంటానని బెదిరించారు. అయినా పోలీసులు గుడి లోపలికి అనుమతించకపోవడంతో కారు వద్దకు వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. స్థానిక మహిళలతో కలిసి అఘోరిపై నీళ్లు కుమ్మరించారు.


# బాధితురాలు అనురాదను ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించిన జిల్లా ఎస్పీ



## బాధితురాలు వద్ద నుండి వివరాలను అడిగి తెలుసుకున్నా జిల్లా ఎస్పీ జానకి షర్మిల..

**నిర్మల్ ప్రతినిధి ( మన వెలుగు ) నవంబర్ 07 :**అప్పులు కట్టాలని వేధించిన వడ్డీ వ్యాపారుల కోసం పోలీసు బృందలను ఏర్పాటు చేసి పంపించమనీ బాధితురాలి తెలిపిన ఎస్పీ జానకి షర్మిల.వేధింపులకు గురిచేసిన వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటా మని తెలిపిన జిల్లా ఎస్పీ..నిన్న భర్త,కూతురు తో సహా బాసర గోదావరిలో దూకిన అనురాధ.నిన్న భర్త వేణు మృత దేహం లభ్యం,కుతురు పౌర్ణమి మృతదేహం కోసం గాలించగా ఈరోజు దొరికిన మృతదేహం.

# గర్భస్థ మారణాలపై వైద్యశాల అధికారులతో కలెక్టర్ సమీక్ష



## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ ప్రతినిధి( మన వెలుగు) నవంబర్ 07 :**గర్భస్థ మహిళల మరణాలు తగ్గించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు బుధవారం నిర్మల్ జిల్లా కలెక్టరేట్లోని తమ ఛాంబర్ లో గర్భస్థ మరణాలపై వైద్యశాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు గర్భం దాల్చిన వెంటనే మహిళలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి అవస రమైన మందులను అందించాలని తెలిపారు, హై రిస్క్ గర్భిణీపులపై నిరంతర పర్యవేక్షణ ఉంచి, అవసరమైన వైద్య చికిత్సలు అందించాలని సూచించారు

# ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం



**నారాయణ పేట ప్రతినిధి ( మన వెలుగు ) నవంబర్ 07** :వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు నిబంధనలు పాటించాలని ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు గురువారం నారాయణపేట పలు కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు, వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ సీటు బెల్టు తప్పక ధరించాలని సూచించారు ,మద్యం సేవించి వాహనాలు నడప రాదని అన్నారు, వాహనాలు నడిఫె సమయంలో అన్ని పత్రాలను అందుబాటులో ఉంచుకోవా లని సూచించారు.

# చికెన్ తిని యువతి మృతి




**నిర్మల్ ప్రతినిధి ( మన వెలుగు ) నవంబర్ 07 :** తెలంగాణలోని నిర్మల్ జిల్లా (డి ) గ్రీన్ రెస్టారెంట్ లో చికెన్ బిర్యానీ తిని యువతి మరణించిన ఘటనలో కొత్త విషయం వెలుగు చూసింది, చికెన్ ఐటమ్స్ పై మయో నైజ్ వేసుకొని తినడం వల్లనే యువతి చనిపోయిందని, పదుల సంఖ్యలో ఆసుపత్రి పాలయ్యారని అధికారులు తెలిపారు దీంతో గురువారం ఆ రెస్టారెంట్ ను అధికారులు సీట్ చేశారు కాగా రాష్ట్రంలో మయోనైజ్ ప్రభుత్వం బ్యాన్ చేసింది అయినా కొన్ని రెస్టారెంట్లో దీన్ని వాడుతుండం గమనార్హం.

## రాష్ట్రస్థాయి పోటీలకు అభిషేకం ఎంపిక



**ముధోల్ (మన వెలుగు ) నవంబర్ 07 :** మండల కేంద్రమైన ముధోల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అభిషేక్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఆదిలాబాద్ జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగినటువంటి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి రెజ్లింగ్ అండర్ -17 బాల-బాలికల పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందినటువంటి అభిషేక్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికావడం పట్ల ప్రధానోపాధ్యాయులు, పిడి శ్రీనివాస్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. రేపు హైదరాబాద్లో జరిగే రెస్లింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

## ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను అందించిన బండి రమేష్




**కూకట్పల్లి ( మన వెలుగు ) నవంబర్ 07 :** కూకట్పల్లి నియోజకవర్గం లోని మూసాపేట్ కు చెందిన యం నూకరాజు కుడి కాలుకు ఇన్ఫెక్షన్ వలన నీరు చేరడంతో చికిత్స కోసం కె పి హెచ్ బి లోని ట్రీట్మెంట్ రేంజ్ హాస్పిటల్ లో చికిత్స పొందడం జరిగింది అనంతరం కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిము క్కల వెంకటేశ్వర రావుని సంప్రదించగ, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిదికి ధరకాస్తూ చేసుకోగ 18500/- పద్దెనిమిది వేయిల అయిదువందల రూపాయలు మంజూరు అయినవి, పి ఇందుకి 24500/- ఇరువైనాలుగు వేయిల అయిదు వందల రూపాయలు మంజురు అయినవి. అట్టి చెక్కులను బండి రమేష్ చేతులమీదుగా బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, కూకట్పల్లి డివిజన్ అధ్యక్షులు మేకల రమేష్, అస్లాం, అరుణ్, అశోక్ పాల్గొన్నారు.

## గ్రామ శివారులో గల బావిలో గుర్తుతెలియని శవం



**ఇబ్రహీంపట్నం ( మన వెలుగు ) నవంబర్ 07 :** ఇబ్రహీంపట్నం మండలంలోని సంస్థాన్ బండ లింగాపూర్ గ్రామ శివారులో ఎన్.హెచ్ 63 రోడ్డుకు అనుకొని ఉన్న కొలీసాగర్ వ్యవసాయ భూమి లో గల బావిలో గుర్తు తెలియని మగ శవం తేది ఉన్నదని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు సమాచారం రాగా ఎస్సై ఏ అనిల్ సంఘటన స్థలానికి చేరుకొని వ్యవసాయ భూమి బావిలో నుండి శవాన్ని బయటకు తీసి పంచనామా నిర్వహించారు బూడిద రంగు గల టి షర్టు బ్లాక్ జీన్స్ ప్యాంటు ఉన్నాయి శవం పూర్తిగా ఉబ్బి గుర్తించలేని స్థితిలో ఉన్నది బండ లింగాపూర్ గ్రామ పంచాయతీ సెక్రెటరీ మంగళంపల్లి భూమేశ్వర్ దరఖాస్తు ఇవ్వగా ఇబ్రహీంపట్నం ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు మృతుని వివరాలు తెలియాల్సి ఉంది.

## వరకట్నం వేధింపులకు భరించలేక మహిళ ఆత్మహత్య



**నిర్మల్ ప్రతినిధి ( మన వెలుగు ) నవంబర్ 07 :** వరకట్నం కోసం భర్త వేధింపులు భరించలేక భార్య మృతి చెందిన ఘటన మామడ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. న్యూ లింగంపల్లి గ్రామానికి చెందిన దేవర పోశెట్టి నవీన్ కు వికాసినితో 2019 లో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా కొన్ని రోజుల నుంచి భర్త నవీన్ అదనపు కట్నం కోసం తన భార్యను వేదించడం మొదలుపెట్టాడు. దీంతో మనస్థాపం చెందిన వికాసిని గురువారం ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

# తూకంలో తేడా ఉంటే వ్యాపారుస్తులపై చర్యలు తప్పవు

### కొలతల శాఖ జోనల్ అధికారి విజయ సారథి



**ముధోల్ ( మన వెలుగు ) నవంబర్ 07 :** వినియోగదారుల హక్కులను పరిరక్షించడంలో భాగంగా వ్యాపారస్తులు తూకంలో తేడాలు ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తూనికలు -కొలతల శాఖ కరీంనగర్ జోనల్ అధికారి విజయ సారథి అన్నారు. గురువారం మండల కేంద్రమైన ముధోల్ లోని కిరాణా దుకాణాలు- స్వీట్ హోమ్ లలో డిజిటల్ తూకాలను పరిశీలించారు. ప్రత్యక్షంగా డిజిటల్ తూకాల్లో బాట్లు వేయగా తేడాలు రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. డిజిటల్ తూకాల్లో తేడాలు గుర్తించి నాలుగు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులు తూకాల్లో మోసానికి పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. వినియోగదారుల హక్కులను పరిరక్షించడంలో భాగంగా సంవత్సర కాలంలో రెండు పర్యాయాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి తూకాల్లో మోసాలు గుర్తించి జరిమాన విధించడంతోపాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వ్యాపారస్తులు సైతం తనవంతు బాధ్యతగా తూకాలను ప్రతి సంవత్సరం నిర్ణీత వ్యవధిలో సరి చూసుకోవాలని పేర్కొన్నారు. తూనికలు -కొలతల అధికారులు వ్యాపార సముదాయాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్న విషయం తెలియడంతో వ్యాపారస్తులు తమ డిజిటల్ తూకాలను దాచుకున్నారు. వ్యాపారస్తులు తూకాలు మోసానికి పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తూనికలు -కొలతల శాఖ నిర్మల్ జిల్లా అధికారి భూలక్ష్మి, సిబ్బంది, తదితరులున్నారు

# వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభం



### మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనందరావు పటేల్

**ముధోల్ (మన వెలుగు) నవంబర్ 07 :** ముధోల్ మండలం లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బ్రహ్మంగావు, రువ్వి,అష్ట, గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా బైంసా ఏ.ఎమ్.సి మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనందరావు పటేల్ మరియు (పి.ఎస్.సి.ఎస్) చైర్మన్ తీగల వెంకటేష్ గౌడ్ రామ్ రెడ్డి మాజీ తాజా సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం రెడ్డి రమేష్ సర్పంచ్ మాజీ ఎంపిటిసి సాయి రెడ్డి సురుగుల పోసెట్టి రావుల శ్రీనివాస్ ఏనుగు ముత్యం డైరెక్టర్ సాయినాథ్ రామనాథ్ పాల్గొన్నారు వరి పండించిన రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది అలాగే ప్రభుత్వం ఆదేశాల మేరకు వరి కేంద్రాల్లో క్వింటల్ ఏ గ్రేడ్ వరి రకం ధాన్యానికి రు :2320. బి గ్రేడ్ క్వింటాల్ వరి రకం దాన్యానికి రు 2300. ప్రభుత్వం చెల్లిస్తుంద న్నారు. రైతులు ప్రైవేట్ వ్యాపారుల దగ్గరకు వెళ్లి నష్టపోకుండా ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని విగ్రహించాలన్నారు

# మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



### ఫిషరీస్ డెవలప్మెంట్ ఆఫీసర్ విజయ్ కిరణ్ కర్

**నిర్మల్ ప్రతినిధి ( మన వెలుగు ) నవంబర్ 07 :** మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఫిషరీస్ డెవలప్మెంట్ ఆఫీసర్ విజయ్ కిరణ్ కర్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన ముధోల్ లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో మండలంలోని మత్స్యకారులకు చేప పిల్లలను ఎంపీడీవో శివకుమార్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 19 గ్రామ పంచాయతీ పరిధిలోని 69 చెరువుల్లో మత్స్యకారులకు 15 లక్షల 18 వేల చేప పిల్లలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఇంకా చెరువులు ఉంటే రెవెన్యూ అధికారుల నుండి ధ్రువీకరణ పత్రం తీసుకొని అందిస్తే వాళ్లకు సైతం వారం రోజుల్లో చేప పిల్లలను అందిస్తామన్నారు. ప్రభుత్వం నాణ్యమైన చేప పిల్లలను మత్స్యకారులకు అందించి వారి ఆర్థిక అభ్యున్నతికి తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. మత్స్యకారులు ప్రభుత్వ పరంగా అందిన చేప పిల్లలను చెరువుల్లో విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం సభ్యులు ఫీల్డ్ మెన్ కె.రాజేందర్, మత్స్యకారులు, తదితరులు పాల్గొన్నారు

# సరైన జాగ్రత్తలతో.. పండంటి.. బిడ్డ కోసం



గర్భాశయం గోడల నుంచి రక్తం, కణజాలాన్ని బయటికి విసర్జించే ప్రక్రియే నెలసరి అంటే. ఆరోగ్యకరమైన నెలసరి స్త్రీలను ఇన్ఫెక్షన్ల బారినుంచి కాపాడుతుంది. దుర్వాసనలు రాకుండా ఉంచుతుంది. నెలసరి సమయంలో సౌకర్యవంతంగా ఉండటానికి దోహదపడుతుంది. ఈ సమయంలో విడుదలయ్యే రక్తాన్ని పీల్చుకునేందుకు శానిటరీ ప్యాడ్స్, ట్యాంపన్స్, మెన్‌స్ట్రువల్ కప్స్, మెన్‌స్ట్రువల్ డిస్కులు, పీరియడ్ అండర్‌వేర్ లాంటి రకరకాల మెన్‌స్ట్రువల్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఉపయోగించినా కొన్ని చిట్కాలను కూడా పాటించాలి. వెజీనాను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. టాయిలెట్‌కు వెళ్లిన ప్రతీసారి, మెన్‌స్ట్రువల్ ఉత్పత్తి వాడటానికి ముందు, ఆ తర్వాత.. చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. వాడిన మెన్‌స్ట్రువల్ వస్తువులను సురక్షితంగా పారవేయాలి. శానిటరీ ప్యాడ్లను తరచూ మారుస్తూ ఉండాలి. ట్యాంపన్లను 4 నుంచి 8 గంటలకోసారి మార్చాల్సిందే. అదే మెన్‌స్ట్రువల్ కప్స్ అయితే వాడిన తర్వాత తప్పకుండా శుభ్రం చేయాలి. తేలికగా, గాలి ఆడేలా ఉండే కాటన్ లోదుస్తులు ధరించాలి. మెన్‌స్ట్రువల్ ఉత్పత్తులను రెగ్యులర్‌గా మారుస్తూ ఉండాలి. ఒకే ప్రొడక్ట్‌ను ఎక్కువకాలం వాడితే దద్దుర్లు వచ్చే అవకాశం ఉంటుంది. సరిపోయినన్ని నీళ్లు తాగాలి. దీనివల్ల మూత్రనాళం ఎప్పటికప్పుడు శుభ్రపడుతూ ఉంటుంది.

ఇన్‌ఫెక్షన్ల ముప్పు తగ్గుతుంది. ఇక మహిళల ఆరోగ్యానికి నెలసరి కూడా ఒక సూచిక. నెలసరి క్రమం తప్పిందంటే.. డయాబెటిస్, థైరాయిడ్ లాంటి వ్యాధులకు సంకేతంగా భావించాలి. దీనికోసం క్యాలెండర్‌ను గానీ, లేదంటే స్మార్ట్‌ఫోన్‌లో యాప్ ద్వారా గానీ నెలసరి క్రమాన్ని గమనించుకుంటూ ఉండాలి. నెలసరి సమయంలో దుర్వాసన వస్తున్నా, తీవ్రంగా, అసాధారణంగా నొప్పి ఉన్నా, రక్తం ఎక్కువగా, ఎక్కువ కాలంపాటు బయటికి వెళ్తున్నా డాక్టర్‌తో మాట్లాడాలి.

**ఆపిల్:** పోషకాలతో నిండిన ఆపిల్ పండ్లు కడుపుతో ఉన్నవారికి ఎంతో మేలుచేస్తాయి. విటమిన్ -ఎ, సితోపాటు ఆపిల్ పండ్లు పొటాషియం, ఫైబర్‌కు మంచి వనరులు. గర్భిణిగా ఉన్నప్పుడు ఆపిల్ పండ్లు తినని మహిళలకు జన్మించిన పిల్లల్లో 5 సంవత్సరాల వయసులో ఆస్తమా లాంటి శ్వాస సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నట్టు తేలింది. ఆపిల్ పోషకాలలోని ఫ్లేవనాయిడ్లలో ఉండే పాలిఫినాలిక్ మిశ్రమాలు యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవే ఆస్తమా ముప్పును తగ్గించడంలో సహాయకారిగా ఉంటాయి.

**అరటి:** విటమిన్లు, మినరల్స్‌తో సమృద్ధమైన అరటిపండ్లు గర్భిణులు తప్పకుండా తినాల్సిన పండ్లు. గర్భిణులను వేధించే సమస్యల్లో సాధారణమైంది ఐరన్ లోపం. దీంతో రక్తహీనత తలెత్తకుండా శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలు పెరగడానికి అరటిపండు దోహదపడుతుంది. గర్భధారణ సమయంలో తలెత్తే వాంతులు, వికారం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అరటిపండ్లలో ఉండే ఫోలిక్ ఆమ్లం కడుపులో ఉన్న బిడ్డకు కూడా మంచిది. ఇది శిశువు ముందస్తు ప్రసవానికి గల అవకాశాలను తగ్గిస్తుంది. అంతేకాకుండా గర్భిణిగా ఉన్నప్పుడు తిండి అంటే మొహం మొత్తుతుంది. అరటిపండు తినడం వల్ల ఆకలి పెరుగుతుంది.

**దానిమ్మ:** దానిమ్మ పండ్లలో పాలిఫినాల్ స్థాయిలు అత్యధికంగా ఉంటాయి. గర్భిణిగా ఉన్నప్పుడు దానిమ్మ పండ్లు తినడం వల్ల శిశువుల నాడుల సంరక్షణలో ఆ పాలిఫినాల్స్ సహాయకారిగా ఉంటాయి. అంతేకాకుండా దానిమ్మపండ్లు విటమిన్ కె, ఐరన్, ఫైబర్, ప్రొటీన్, క్యాల్షియం లాంటివాటికి పెద్ద నిధులు కూడా.

**నారింజ:** గర్భిణులు తీసుకునే పండ్లలో ముందువరసలో ఉండేవి నారింజ. వీటిని పండుగాను, లేదంటే రసం రూపంలోనూ తీసుకుంటారు. అయితే ప్రిజర్వేటివ్‌లు ఉండే టెట్రా ప్యాక్ జ్యూస్‌లను మాత్రం తీసుకోకపోవడమే మంచిది. నారింజను పండు రూపంలో తింటే దాని ప్రయోజనాలు పూర్తిగా చేకూరుతాయి. ఒకవేళ పండు ఇష్టం లేకపోతే, ఇంటి దగ్గరే తాజా పండ్ల రసం తాగాలి. నారింజ రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. పైగా కడుపులో ఉన్న పిండం మెదడు అభివృద్ధిలో నారింజ దోహదపడుతుంది. రక్తపోటును కూడా అదుపులో ఉంచుతుంది.

**మామిడిపండ్లు:** చాలామంది గర్భిణులు మామిడికాయ, చింతకాయ అంటే ఉవ్విళ్లూరుతుంటారు. ఎ, సి విటమిన్లతో సమృద్ధమైన మామిడి పండ్లు కూడా కడుపుతో ఉన్నప్పుడు ఇష్టంగా తింటారు. సహజంగా మగ్గిన పండ్లయితే ఫర్వాలేదు, కానీ క్యాల్షియం కార్బయిడ్ వాడిన పండ్లతోనే సమస్య అంతా. కాబట్టి, గర్భిణులు మామిడి పండ్ల ఎంపిక విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాల్సిందే.

## ఎడిటోరియల్

# భారాల మోత!



ప్రజల నెత్తిన మరో రూ.12 వేల కోట్ల ట్రూ అప్ చార్జీల భారం మోపాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించటం దారుణం. ఇంధన ఛార్జీల సర్దుబాటు పేరుతో ఇప్పటికే రూ.6 వేల కోట్ల భారం వేసిన కూటమి సర్కారు ఆ పిడుగు తలపై ఉండగానే, మరొకసారి అంతకు రెట్టింపు విద్యుత్ భారంతో ఉరుముతోంది. ఈ రెండు భారాలూ ఏకమైతే, విద్యుత్ వినియోగదారులపై అసలు కన్నా అదనపు భారమే ఎక్కువై, నెలవారీ బిల్లులు తడిసి మోపెడవుతాయి. అటు కేంద్ర ప్రభుత్వపు పెట్రో భారాలతో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతుండగా, దీనికి ఇప్పుడు కరెంటు భారాలు కూడా తోడవుతాయి. ద్రవ్యోల్బణం ధాటికి విలవిల్లాడుతున్న సామాన్యుల బతుకులపై అర్థంపర్థం లేని సర్దుపోటు ఛార్జీలు బనాయించటం మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టే అవుతుంది! తాము అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి విద్యుత్ భారం కూడా వేయబోమని ఎన్నికలకు ముందు చంద్రబాబు చెప్పిన మాటలకు భిన్నంగా ఇప్పుడు జరుగుతోంది. విద్యుత్ భారాలను పెంచటం అంటే– ప్రజల దైనందిన జీవన స్థితిగతులను మరింత దుర్భరం చేయటమేనన్న ఇంగితాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తెరగాలి. గతంలో ఎప్పుడో వాడిన విద్యుత్‌కు సర్దుబాటు ఛార్జీలు అంటూ ఆ తరువాతి కాలంలో అదనపు వసూళ్లకు పాల్పడడం ఒక అడ్డగోలు విధానం. పంపిణీ సంస్థలు పదే పదే ఇదే విధంగా అనంతర భారాలను వినియోగదారుల మీద రుద్దుతున్నాయి. గత నెలలోనే ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) రూ.6072 కోట్ల సర్దుబాటు మొత్తాన్ని వినియోగదారుల నుంచి వసూలు చేయటానికి పంపిణీ సంస్థలకు అనుమతినిచ్చింది. ఈ భారం డిసెంబరులో వచ్చే నవంబరు నెల కరెంటు బిల్లుల్లో పడనుంది. ఇదిలా ఉండగానే– విద్యుత్ పంపిణీ సంస్థలు 2023 ... 24 సంవత్సరానికి విద్యుత్, ఇంధన కొనుగోలు ఖర్చులో సర్దుబాటు కోసమని చెబుతూ, రూ.11,826 కోట్ల భారాన్ని ప్రతిపాదించాయి. ఇందులో రూ.3500 కోట్ల మొత్తాన్ని డిస్కంలు ఇప్పటికే వినియోగదారుల నుంచి అదనపు ఛార్జీల పేరిట వసూలు చేశాయి. మిగతా సొమ్మును వసూలు చేయటానికి తాజాగా ఇఆర్‌సి అనుమతిని కోరాయి. ఆమోదం లభిస్తే జనవరిలోనో, ఆ తరువాతనో వచ్చే బిల్లుల్లో ఈ అదనపు భారం పడుతుంది. దీనివల్ల యూనిట్ కనీస ధర వచ్చే కొత్త బిల్లుల్లో రూ.3ల వరకూ మోగుతోంది.డిస్కంలకు పంపిణీ, ఇతర రూపాల్లో ఇంత మేర నష్టాలు ఎందుకు వస్తున్నాయి? ప్రభుత్వ విద్యుత్ ఉత్పాదక సంస్థల నుంచి కాక ప్రయివేటుగా కొనటం వల్లనే ఇంతింత వ్యత్యాసాలు వస్తున్నాయా? వినియోగ కాలానికి, మదింపు సమయానికి మధ్య అంచనాల్లో, ధరల్లో భారీ తేడా ఎందుకు ఉత్పన్నమవుతోంది? ఇత్యాది సందేహాలన్నింటికీ సమాధానాలు రావాల్సి ఉంది. కానీ, డిస్కంలు భారాలను వల్లించి, వడ్డించటం తప్ప కారణాల విశ్లేషణ జోలికి పోవటం లేదు. ప్రజల మీద ఎడాపెడా భారాలు వేస్తున్నప్పుడు దానికి గల నిర్దిష్ట పరిస్థితులేమిటో కూడా చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రయివేటు కంపెనీల లాభాల కోసమే ఇదంతా జరుగుతుందా? అన్నది తేల్చాలి. ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేసి, వాటి నుంచి విద్యుత్ కొనుగోలు చేయటం ద్వారా ప్రయివేటు కంపెనీలకు ముకుతాడు వేయాలి. అలాంటి ఆచరణకు ఎప్పుడో తిలోదకాలు ఇచ్చిన పాలకులు మార్కెట్టు ఇష్టారీతికి వినియోగదారులకు బలి చేయటం దారుణం. తప్పుడు విధానాలు, అవినీతి, అధిక భారాలను మోపే ఒప్పందాలూ, ఓపెన్ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లూ %ె% ప్రజలపై పెను భారాలుగా పరిణమిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో సమీక్షించి, విధానపరమైన లోపాలను చక్కదిద్దాలి. పంపిణీలో జరుగుతున్న అన్ని రకాల లోపాలనూ అదుపుచేయాలి. ఈలోగా డిస్కంలు కోరీకోరగానే అదనపు భారాలను ప్రజల మీదికి బదలాయించకుండా ప్రభుత్వమే భరించాలి. 'తాత కతికిన దానిని మనవడి వద్ద పితికే' మోసకారి ట్రూఅప్ ఛార్జీల విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలి. నెల వ్యవధిలోనే జనం నెత్తి మీద వేయటానికి సిద్ధం చేసిన రూ.18 వేల కోట్ల భారాన్ని ఉపసంహరించుకోవాలి. నిజ వేతనాలు తగ్గిపోయి, నిత్యావసరాల ధరలు పెచ్చు పెరిగిపోయి, నానా ఇబ్బందులూ పడుతున్న ప్రజానీకంపై పెనుభారాలు మోపటం సమంజసం కాదు. ఈ భారాలన్నీ గత ప్రభుత్వపు వైఫల్యాలేనంటూ సమర్థించుకోవటం కూడా జన సమ్మతం కాదు.

# విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై మోడీ–చంద్రబాబు

# తాజా వ్యూహం ఎటువైపు?



విశాఖ స్టీల్ ప్లాంట్‌పై 'చంద్రబాబు–పవన్' కూటమి ప్రభుత్వ వైఖరి రోజుకొక విధంగా మారుతున్నది. ప్రైవేటీకరణ ఉపసంహరణ, సొంత గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనం కోసం కేంద్ర బిజెపిపై ఒత్తిడి చేయడం మానేసి ఆర్థిక ప్యాకేజీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై కార్మికులు పెట్టుకున్న నమ్మకం సన్నగిల్లుతున్నది. రెండోవైపు కేంద్ర బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విధానం నుండి వెనక్కి తగ్గకపోగా కార్మికులపై దాడి ఎక్కుపెట్టింది. ఈ దాడిని నిలువరించేలా రాష్ట్ర ప్రభుత్వ చర్యలు లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. 'మోడీ–బాబు'ల ఈ తాజా వ్యూహం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ నుండి కాపాడుతుందనే నమ్మకం సడలిపోతున్నది.గత అసెంబ్లీ ఎన్నికల్లో 'చంద్రబాబు–పవన్' ద్వయం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోను ప్రైవేటీకరణ కానివ్వమని, మా కూటమిని గెలిపిస్తే స్టీల్‌ప్లాంట్‌కు సొంత ముడి ఇనుప గనులు కేటాయిస్తామని లేదా సెయిల్‌లో విలీనం చేస్తామని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటింది. రాష్ట్ర ముఖ్యమంత్రి పలుమార్లు కేంద్ర స్టీల్‌మంత్రి, ఆర్థికమంత్రి, ప్రధానమంత్రితో చర్చలు జరిపారు. అయినా ఇప్పటి వరకు కేంద్ర బిజెపి ప్రభుత్వం మాత్రం ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరిస్తున్నట్లు ప్రకటన చెయ్యలేదు. ముఖ్యమంత్రి కూడ దీనిపై ఒత్తిడి చేయటం లేదు. తాజాగా ఆర్థిక ప్యాకేజీని ముందుకు తీసుకొస్తున్నారు. ప్లాంట్ పూర్తి స్థాయిలో నడవాలంటే తప్పని సరిగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాల్సిందే. అప్పుల భారం తగ్గించాల్సిందే. కానీ ప్రైవేటీకరణ ఉపసంహరిస్తున్నాం అనే ప్రకటన చేయకుండా ఆర్థిక ప్యాకేజీనే ముందుకు తీసుకురావటం వల్ల ప్లాంట్ సమస్యకి శాశ్వత పరిష్కారం లభించదు. ప్లాంట్‌కి వచ్చిన సమస్యలన్నీ ప్రైవేటీకరణ నిర్ణయం వల్లే. ప్రైవేటీకరణ ఉపసంహరిస్తేనే అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పష్టత ప్రకటించకుండా దాచిపెడుతున్నది. కాకపోతే మేం అధికారంలో ఉన్నంతకాలం ప్రైవేటీకరణ కానివ్వం అంటున్నారు. దీని అర్థమేమిటి? ప్రైవేటీకరణ నిర్ణయం నుండి బిజెపి ప్రభుత్వం వెనక్కి వెళ్ళదని చెప్పటమే!ఇటీవల ముఖ్యమంత్రి స్టీల్‌ప్లాంట్‌పై మాట్లాడిన మాటలు బిజెపి వాదనలను మరింత బలపర్చేవిగా ఉన్నాయి. గత మూడేళ్ల నుండి బిజెపి విశాఖ స్టీట్‌ప్లాంట్‌పై అనేక విధాలుగా దుష్ప్రచారం చేస్తున్నది. ఇప్పుడు చంద్రబాబు నాయుడు స్టీల్‌ప్లాంట్‌పై వేస్తున్న ప్రశ్నలు, చేస్తున్న వాదనలు ఇలాంటివే. ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్లకి లాభాలు వస్తుండగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు నష్టాలు వస్తున్నాయి? అప్పులు ఎందుకు పెరుగుతున్నాయి? గతంలో ప్లాంట్ బిఐఎఫ్ఆర్ కి వెళ్ళినప్పుడు ఆర్థిక సహాయం అందించాం! మళ్లీ ఇప్పుడు ఎందుకు ఇవ్వాల్సి వస్తున్నది? ఎంతకాలం ఇలా ఇస్తాం? ప్రతిసారీ సెంటిమెంట్ ముందుకు తీసుకొస్తున్నారు. సెంటిమెంటు ఎంతోకాలం పని చేయదు. ప్లాంట్ సొంత కాళ్ళపై నిలబడాలి%ె%అని ముఖ్యమంత్రి మాట్లాడారు. ఇవన్నీ ఆయనకు తెలియనివి కావు. ఎందుకు మళ్లీ వీటిని తెరపైకి తెస్తున్నారు? ఎన్నికలకు ముందు ఈ వాదనలు ఎందుకు చేయలేదు? అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పల్లవి ఎందుకెత్తుకున్నారు? వీటిని కావాలనే పథకం ప్రకారం ముఖ్యమంత్రి ముందుకు తీసుకొస్తున్నారు. బిజెపి కూడా విశాఖ స్టీల్‌ప్లాంట్ నష్టాల్లో కూరుకుపోయిందని, ఇది నష్టాల కంపెనీ అని, దీనిని ఎంత మాత్రం ప్రభుత్వ రంగంలో ఉంచకూడదని ప్రచారం చేసింది. మొత్తంగా ఇది నష్టాల పరిశ్రమ అనే భావన కల్పించాలనే లక్ష్యంతో తెలుగుదేశం కూటమి, కేంద్ర బిజెపి ప్రభుత్వం కలిసి ఈ వాదనలను ముందుకు తీసుకొస్తున్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు తెస్తున్న వాదనలన్నీ పూర్తిగా దురుద్దేశంతో కూడుకున్నవి. వాస్తవంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ నష్టాల పరిశ్రమ కాదు. ఇప్పటి వరకు మొత్తం రూ.12,900 కోట్ల లాభాలు పొందింది. 2018–19లో కూడ లాభాలు పొందింది. 2021–22లో అయితే అత్యధిక టర్నోవర్‌తో లాభాలు గడించి రికార్డు సృష్టించింది. ఇదే ఏడాది విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్ముతున్నట్లు బిజెపి ప్రభుత్వం ప్రకటన చేసింది. ఇక్కడ నుండి ప్లాంట్‌ను దెబ్బతీసే కుట్రలు ప్రారంభమయ్యాయి. 73 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని వినియోగంలోకి రానివ్వకుండా ఉత్పత్తి పెరుగుదలను అడ్డుకుంది. ఉత్పత్తికి కీలకమైన 3వ బ్లాస్ట్ ఫర్నేస్‌ను అర్థాంతరంగా మూసేసింది. ముడిసరుకు, వర్కింగ్ క్యాపిటల్ సమస్యని సృష్టించి మరో బ్లాస్ట్ ఫర్నేస్‌ను కూడా మూసేసి ప్లాంట్‌ని నష్టాల్లోకి నెట్టింది.

అప్పులు ఎందుకు పెరిగాయి? సొంత లాభాల రిజర్వు నిధులతో పాటు బ్యాంకుల నుండి మరో 12 వేల కోట్లు అప్పులు తీసుకొని ప్లాంట్‌ని 34 లక్షల టన్నుల నుండి 73 లక్షల టన్నుల సామర్థ్యానికి విస్తరించింది. ఈ విస్తరణ వల్ల అదనంగా 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించబడ్డాయి. అయితే కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రైవేటీకరణ వైఖరి వల్ల పూర్తి సామర్థ్యం వినియోగంలోకి రాలేదు. ఫలితంగా అప్పులు పెరిగాయి. మరో ముఖ్యమైనది స్టీల్‌ప్లాంట్‌కి సొంత ముడి ఇనుప గనులు లేవు. దేశంలో అన్ని ప్రైవేట్, ప్రభుత్వ పరిశ్రమలకు సొంత ముడి ఇనుప గనులు కేటాయించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించిన తరువాతే దేశంలో ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ల నిర్మాణం జరిగింది. వీటన్నింటికి పుష్కలంగా ఇనుప గనులు కేటాయించారు. విశాఖ స్టీల్‌ప్లాంటుకు మాత్రం ముడి ఇనుప గనులు, బొగ్గు గనులు కేటాయించకుండా వివక్షత చూపుతూ వస్తున్నారు. ఫలితంగా స్టీల్‌ప్లాంట్‌పై ఏడాదికి కనీసం రూ.3 వేల కోట్ల అదనపు భారం ముడి ఇనుప గనుల వ్యయం మీదే పడుతున్నది. ప్రతి టన్ను ముడి ఇనుముపై రూ. 5 నుండి 8 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఫలితంగా ఉత్పత్తి ఖర్చులు పెరిగి స్టీల్‌ప్లాంట్ నష్టాలు చవిచూస్తున్నది. ఈ కఠోర వాస్తవాలన్ని 'తెలుగుదేశం–జనసేన' కూటమి ప్రభుత్వ కళ్ళ ముందు కనిపిస్తున్నవే. కాని కార్మికులు ఎక్కువమంది ఉన్నారని, పని చేయడంలేదని అందువల్లే నష్టాలు వస్తున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారు.

2000 సంవత్సరంలో ప్లాంట్‌కి కేంద్ర ప్రభుత్వం క్యాపిటల్ రీస్ట్రక్చరింగ్ కింద సహాయం అందించింది. దీనినే పదేపదే ప్రచారం చేస్తున్నారు. ఏదో దానధర్మం చేస్తున్నట్లు, దయాదాక్షిణ్యంగా ఇస్తున్నట్లు వీరి ప్రచారం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.2937 కోట్ల సొమ్మును తిరిగి చెల్లించటంతోపాటు ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి పన్నులు, డివిడెండ్ల ద్వారా రూ.58 వేల కోట్లు తిరిగి చెల్లించిన వాస్తవాలను కప్పిపుచ్చి ప్లాంట్‌పై దుష్ప్రచారానికి వొడిగట్టారు. ఇది ప్రభుత్వ కంపెనీ అని, దీనివల్ల ప్రాంతీయ అభివృద్ధి జరుగుతున్నదని, ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నదనే, ఒక మహా నగరానికి ఆర్థిక జీవనాడిగా ఉందనే వాస్తవాలని ప్రజల నుండి తొలగించటానికి ఈ ప్రచారాన్ని ముందుకు తెస్తున్నారు. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ విలువ రూ. 3 లక్షల కోట్లు పైనే ఉంది. మరో కోటి 20 లక్షల టన్నుల సామర్థ్య విస్తరణకు, 50 వేల మందికి అదనంగా ఉద్యోగాలు కల్పించడానికి అవకాశాలున్నాయి. దేశంలో సముద్ర తీరం, పోర్టు కనెక్టివిటి ఉన్న ఏకైక స్టీల్‌ప్లాంట్ కూడా ఇది ఒక్కటే. ఇటువంటి శక్తివంతమైన ప్రజాభివృద్ధి స్టీల్‌ప్లాంట్‌ని ధ్వంసం చేయటం దేశద్రోహమే అవుతుంది.

ఈ నేపథ్యంలో విశాఖ స్టీల్‌ను సెయిల్‌లో విలీనం చేయటమే శాశ్వత పరిష్కారం. ఇది అందరి డిమాండ్. 'చంద్రబాబు–పవన్'లు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పదేపదే చెబుతూ వచ్చింది కూడా ఇదే. ఎందుకు సెయిల్‌లో విలీనం చేయాలి? స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) అనేది ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సంస్థ. ఈ సంస్థ కింద భారతదేశంలో ప్రభుత్వ స్టీల్ కంపెనీలైన భిలారు, బొకారో, దుర్గాపూర్, రూర్కెలా, ఇస్కో తదితర అన్ని సెయిల్ కిందే ఉన్నాయి. ఒక్క వైజాగ్ స్టీల్‌ప్లాంట్ మాత్రమే సెయిల్ బయట ఉంది. ప్రారంభంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ కూడా సెయిల్ లోనే ఉండేది. 1982లో దీనిని సెయిల్ నుండి విడదీశారు. ఆ సందర్భంగా బైలదిల్లా లోని 4, 5 బ్లాక్‌ల ఇనుప గనులు ఇస్తామని, ముడి ఇనుప ఖనిజం నిరంతరాయంగా సరఫరా చేస్తామని అప్పటి కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. సెయిల్‌లో ఉద్యోగులకు ఉన్న సదుపాయాలన్ని విశాఖ స్టీల్‌లో కూడా అమలు చేస్తామనే భరోసా కూడా ఇచ్చారు. కానీ ఇచ్చిన హామీ ప్రకారం సొంత ముడి ఇనుప గనులు కేటాయించలేదు. ఈ పరిస్థితుల్లో తిరిగి సెయిల్‌లో విలీనం చేయటమే సరైన పరిష్కారం. సెయిల్ దగ్గర పెద్ద ఎత్తున ముడి ఇనుప గనులు ఉన్నాయి. దీంతో స్టీల్‌ప్లాంట్‌కి ముడి ఇనుప గనుల సమస్య పరిష్కారం అవుతుంది.

కేంద్ర స్టీల్ సహాయ మంత్రి, రాష్ట్ర బిజెపికి చెందిన శ్రీనివాస వర్మ కొత్త పల్లవి అందుకున్నారు. సెయిల్‌లో విలీనం చేయటానికి టెక్నికల్ సమస్యలు ఉన్నాయని, 35 శాతం వాటాలు అమ్మబడ్డాయని అంటున్నారు. అంటే సెయిల్‌లో విలీనానికి బిజెపి అంగీకరించటం లేదని తేలిపోతున్నది. అందువల్లే ముఖ్యమంత్రి సెయిల్‌లో విలీనంపై ఒత్తిడి చేయటంలేదని తెలుస్తున్నది. ఇప్పుడు పరిస్థితి ఏమిటి? ఒక వైపు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తాం, ప్యాకేజీకి చర్చిస్తున్నాం అని రాష్ట్ర ముఖ్యమంత్రి పదేపదే ప్రచారం చేస్తుండగా రెండో వైపు కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్లాంట్‌పై దాడి తీవ్రతరం చేసింది. రాత్రికి రాత్రే ఎలాంటి నోటిసులు ఇవ్వకుండానే 4200 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడానికి ప్రయత్నం చేసారు. ఆఫీసర్లను ఇతర ప్లాంట్లకు బదిలీ చేస్తున్నారు. 2500 మంది పర్మినెంట్ కార్మికులను తొలగించడానికి విఆర్ఎస్ ప్రకటించారు. మెయింటినెన్స్ కోసం కాంట్రాక్టర్ల టెండర్లు పిలవకుండా నిలుపుదల చేసి 700 మందికి పైగా కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి లేకుండా చేశారు. పర్మినెంట్ కార్మికులకు వేతనాలు నెలలో రెండు సార్లు ఇస్తూ ఇప్పుడు ఏకంగా స్టీల్ మంత్రి చెబితేనే వేతనాలు ఇస్తామని యాజమాన్యం చెపుతున్నది. కాంట్రాక్టు కార్మికులకైతే 2 లేదా 3 నెలలకొకసారి వేతనాలు ఇస్తున్నారు. రిటైర్ అయిన వారికి ఇవ్వాల్సిన ఫైనల్ సెటిల్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడంలేదు. ఇంటి అద్దె అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఎ)ని నిలుపుదల చేశారు. క్వార్టర్స్ విద్యుత్ చార్జీలు యూనిట్ ధర 8 రూపాయలకు పెంచారు. కార్మికుల పొదుపు సొమ్మును కూడా వినియోగించుకోనీయటం లేదు. ఇలా అనేక చట్టబద్ధ హక్కులు, సదుపాయాలు ఇవ్వబోమని ఏకపక్షంగా సర్క్యులర్లు జారీ చేశారు. ఒక ప్రభుత్వ రంగ సంస్థలో రాజ్యాంగం కల్పించిన కార్మిక చట్టాలన్నింటిని బిజెపి యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ ప్లాంటులో అల్లకల్లోలం సృష్టిస్తున్నది. ముఖ్యమంత్రికి ఈ అరాచకం అంతా తెలుసు. కాని కేంద్ర బిజెపిపై ఒత్తిడి పెంచి వీటిని ఆపే చర్యలు చేపట్టకుండా నరేంద్ర మోడీ భజన చేస్తున్నారు.ప్లాంట్ రక్షణ, ప్యాకేజీ చర్చల పేర చంద్రబాబు–పవన్ కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తున్నది. ఈ వ్యూహంలో ప్రైవేటీకరణ ఉపసంహరణ, సొంత గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనం, అప్పులపై మారటోరియం, నిర్వాసితులకు ఉపాధి, ప్రస్తుతం ఉన్న ఉద్యోగులకు రక్షణ వంటి కీలకమైన చర్యలు మసకబారిపోతున్నాయి. ఈ వ్యూహం విశాఖ స్టీల్ ప్లాంట్ భవిష్యత్తుకి తీవ్ర నష్టం. రాష్ట్ర ప్రభుత్వం ఈ వైఖరి వీడాలి. కేంద్ర బిజెపిపై ఒత్తిడి పెంచి తక్షణం ప్రైవేటీకరణ ఉపసంహరిస్తూ, ప్లాంట్‌ని సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటన చేయించాలి. ఈ నిర్ణయమే రాష్ట్రానికి భవిష్యత్తు.

# అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బిజెపి కుతంత్రాలు

ఏదో రకంగా ఎన్నికల్లో గెలవడం, అధికారాన్ని చేజిక్కించుకోవడం బిజెపి లక్ష్యం. దాని కోసం ప్రజలను చీల్చడానికి, వారి మధ్య ఘర్షణలు సృష్టించడానికి కూడా ఆ పార్టీ వెనకాడదన్నది ఇప్పటికే నిరూపితమైన సత్యం! మెజార్టీ ప్రజలను ఆకట్టుకోవడానికి ఒకవైపు తీవ్ర హిందుత్వాన్ని ముందుకు తీసుకువస్తూ, క్షేత్ర స్థాయిలో అవసరాలను బట్టి మనువాదాన్ని, కులతత్వాన్ని ఆశ్రయిస్తుంది. ఇటీవల జరిగిన హర్యానా ఎన్నికలతో పాటు, వివిధ రాష్ట్రాల్లో అనుసరిస్తున్న ఆ విద్వేష విష వ్యూహాన్నే జారండ్ ఎన్నికల్లో సైతం బిజెపి అనుసరిస్తోంది.

రాష్ట్ర జనాభాలో 26 శాతం కంటే కొంచెం ఎక్కువగా ఉన్న గిరిజనుల ఓట్లను గంపగుత్తుగా దండుకోవడమే లక్ష్యంగా బిజెపి నేతల ఈ విష ప్రచారం సాగుతోంది. ఈ రాష్ట్రంలోని 81 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 28 స్థానాలు షెడ్యూల్డ్ తెగలకు రిజర్వు అయ్యాయంటే ఆదివాసీ ఓట్ల ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు బిజెపిని తిరస్కరించారు. అప్పటి నుండి ఈ రాష్ట్రంపై బిజెపి ప్రత్యేకంగా దృష్టి సారించింది. మైనార్టీలను ప్రత్యేకించి ముస్లింలను బూచిగా చూపి గిరిజనుల్లో భయోత్పాతాలను రెచ్చగొట్టే యత్నాలు చేస్తోంది. బంగ్లాదేశ్ నుండి పెద్ద ఎత్తున చొరబాట్లు జరుగుతున్నాయని, దీని కారణంగా ఆదివాసీల భూములు, వనరులు ప్రమాదంలో పడతాయన్న ప్రచారాన్ని కొన్ని సంవత్సరాలుగా ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున చేస్తున్నాయి. దీనిని ఆ రాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేయడంతో హైకోర్టు జోక్యం చేసుకుని ఈ ప్రచారంలోని నిజానిజాలను తేల్చడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఉన్నతాధికారులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ విచారణ కొనసాగుతోంది. అయినా ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి ఈ విషయాన్ని ప్రస్తావించారు. ముస్లింలను చొరబాటుదారులుగా చిత్రీకరించడంతో పాటు వారు గిరిజనుల ఆహారాన్ని, కుమార్తెలను అపహరిస్తున్నారని చెప్పారు.

దేశ ప్రధాని ఇలా మాట్లాడటం ఎంత దిగజారుడుతనం? ప్రజల మధ్య విభేదాలు సృష్టించి ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న కపట వ్యూహం తప్ప దీనిలో మరేదైనా ఉందా? ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా? హోంమంత్రి అమిత్‌షా, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి శివరాజ్ చౌహాన్‌లతో పాటు పలువురు ఇతర నాయకులదీ విద్వేషపు బాటే! ఇంతమంది, ఇంత బహిరంగంగా మత విద్వేషాలను రెచ్చగొడుతున్నా ఘనత వహించిన ఎన్నికల కమిషన్‌కు మాత్రం ఇవేమి పట్టడం లేదు. సుమోటోగా స్పందించాల్సిన ఇసి ఫిర్యాదులు అందినా మౌనంగా ఉండటం దిగ్భ్రాంతికరం.ఎన్నికల వేళ ఏకరూప పౌర స్మృతి (యునిఫాం సివిల్ కోడ్–యుసిసి)ని బిజెపి తెరమీదకు తీసుకురావడం మరింత వివాదాస్పదంగా మారింది. కేంద్ర మంత్రి అమిత్ షా విడుదలచేసిన 'సంకల్ప పత్ర'లో తాము గెలిస్తే రాష్ట్రంలో యుసిసిని అమలు చేస్తామని, అయితే, దాని నుండి గిరిజనులను మినహాయిస్తామని బిజెపి పేర్కొంది. 'ఒకే దేశం..ఒకే చట్టం.. ఒకే ఎన్నికలు..' అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు, ఆ పార్టీ నేతలందరూ ఊదరగొడుతుండగా, జారండ్‌లో యుసిసి నుండి గిరిజనులను మినహాయిస్తామని చెప్పడం బిజెపి కపట నాటకాన్ని బయటపెడుతోంది.

ప్రజలను కులం, మతం ప్రాతిపదిక విభజించి రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవాలన్న బిజెపి ఆలోచన ధోరణికి ఈ ప్రకటన నిలువెత్తు నిదర్శనం. సమాజంలో అన్ని విధాలుగా వెనకబడి, తమవైన సొంత సంస్కృతి, సాంప్రదాయాలు కలిగి ఉన్న గిరిజనులకు యుసిసి నుండి ఇటువంటి మినహాయింపు ఇవ్వాల్సిందే! జారండ్‌లోని గిరిజనులకే కాదు, దేశమంతా ఇటువంటి విభిన్న సాంప్రదాయాలు కలిగిన వారు ఎందరో ఉన్నారు. అందులోనూ సామాజిక వివక్ష, ఆర్థిక వెనుకబాటుతనం, విభిన్న తెగల ఆచారాలు, సంస్కృతులను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా ఏకరూప పౌరస్మృతిని రుద్దడం సరికాదు. సున్నితమైన ఇటువంటి అంశాన్ని రాజకీయ స్వప్రయోజనాల కోసం వాడుకోవడం బిజెపి దివాళాకోరుతనానికి నిదర్శనం. చైతన్యవంతమైన జారండ్ ప్రజలు, ముఖ్యంగా దళితులు, మహిళలు, మైనార్టీలు, గిరిజనులు ఈ కుతంత్రాలను అర్థం చేసుకుని సమిష్టిగా తిప్పికొడతారని ఆశిద్దాం.